సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం | 4 | జూన్ | 2023



రెగ్యులరైజ్ చేసేవరకు ఉద్యమిస్తాం..
యూనివర్సిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేసేవరకు ఉద్యమిస్తామని జేఏసీ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ ఆశీర్వాదం అన్నారు.
- 10లో▸



ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన అర్చకులు
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సకల జనుల సమ్మెలో పాల్గొని ఉద్యమస్ఫూర్తిని రగిల్చిన అర్చకులను కాపాడుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని గంగు ఉపేంద్రశర్మ అన్నారు.
- 10లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
42.0⁰/29.0⁰

జిల్లాలో ఉదయం నుంచే ఎండలు దంచికొడుతాయి. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

ఉలికిపాటు..!



2003లో వరంగల్‌లో జరిగిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఘటన (ఫైల్)

- కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఘటనతో ప్రజల బెంబేలు
- గుర్తుకొచ్చిన కాజీపేట సబ్ డివిజన్‌లో జరిగిన రైలు ఘటనలు

- వివరాలు 10లో▸

ఒడిశా రాష్ట్రం బాలాసోర్ వద్ద జరిగిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఘటనతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఎంతమంది చనిపోయారు.. అందులో తెలంగాణ వారు, అందులో ఉమ్మడి జిల్లా వారు ఎవరైన ఉన్నారా అని ఆరా తీస్తున్నారు. గతంలో జనగామ యశ్వంతపూర్ వాగులో నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్, వరంగల్‌లో జరిగిన గోల్కొండ ఘటనలను గుర్తు చేసుకుంటున్నారు.

- కాజీపేట రూరల్



2008లో గౌతమి ఎక్స్‌ప్రెస్ ఘటన (ఫైల్)

న్యూస్‌రీల్

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం



భూపాలపల్లి అర్బన్: సింగరేణి ఆధ్వర్యంలో భూపాలపల్లి ఏరియాలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం శనివారం ముగిసినట్లు ఏరియా అధికార ప్రతినిధి తుకారం తెలిపారు. స్థానిక అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు హాజరై శిక్షణ పొందిన క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ వేసవి ఉచిత శిక్షణ శిబిరంలో 25రోజుల పాటు బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్ క్రీడలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రతి రోజు వ్యాయామం చేయాలని సూచించారు. దీంతో క్రమశిక్షణ అలవాటు పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సమ్మయ్య, అధికారులు షరీఫ్, శ్రీనివాస్, కోచ్‌లు శరత్, తిరుపతినాయక్, శ్యామ్, రమేష్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన



భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని తపాలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని శనివారం హనుమకొండ తపాలా డివిజన్ అధికారి బానోత్ నందా పరిశీలించారు. ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక ఆధార్ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు చేసుకునే వారు ఉచితంగా చేసుకునే అవకాశం ఉందన్నారు. 5నుంచి 15సంవత్సరాలు దాటిన పిల్లలకు తప్పని సరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. మార్పులు చేర్పులకు కూడా అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ విజయ్, పోస్ట్‌మాస్టర్ ఖలీల్‌పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

'బడిబాట' ప్రారంభం



భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని, బడీడు పిల్లలు, బడి బయట పిల్లలకు పాఠశాలలకు పంపించాలని కోరారు. జంగేడులో ఉపాధ్యాయులు కరపత్రాలు పంచుతూ, ఫ్లెక్సీలతో ప్రచారం నిర్వహించారు.

10న జాతీయ లోక్ అదాలత్

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 10వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం స్థానిక న్యాయవాదులతో జడ్జి సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కారం చేస్తామని.. కేసుల్లో ఇరువర్గాలను న్యాయవాదులు సమన్వయంతో కీలకపాత్ర పోషించాలన్నారు. రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి రాంచందర్‌రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వనరుల దోపిడీ



భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని సహజ వనరులు దోపిడీకి గురవుతున్నాయని ఉత్తర తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు శనివారం కలెక్టర్ కార్యాలయంలోని ఏఓ మహేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రజలకు ఉచిత ఇసుకను సరఫరా చేయాలన్నారు. రోడ్లను విస్తరించి రోడ్డు ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. వేయి పడకల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించాలన్నారు. ఓపెన్‌కాస్టు ప్రభావిత గ్రామాలను వెంటనే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగుల సమ్మయ్య, కిరణ్, రవీందర్, వెంకటనారాయణ, పోషన్న, గౌరికృష్ణ, మధు, అశోక్ పాల్గొన్నారు.

చెప్పినట్టు వింటాం..
చెప్పింది చేస్తాం..

..ఇదీ కొందరు అధికారుల రాయబారం
- పోస్టింగ్‌ల కోసం మొదలైన పైరవీలు
- మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు
- మూడేళ్లకు మించి ఒకేచోట పనిచేసే వారికి స్థానచలనం
- బదిలీలకు గడువు జూలై 31... ఎన్నికల సంఘం ఆదేశాలు
- రెవెన్యూ, పోలీస్‌శాఖల్లో పోస్టింగ్‌ల కోసం ఆరాటం
- ఎన్నికల కమిషన్ ఉత్తర్వులతో దూకుడు పెంచిన ఆశావహులు

సాక్షిప్రతినిధి, వరంగల్: అసెంబ్లీ ఎన్నికలపై ఎన్నికల సంఘం (ఈసీ) కసరత్తు ఊపందుకున్న నేపథ్యంలో బదిలీల ప్రక్రియ కీలకంగా మారింది. దీంతో ఒకే జిల్లాలో మూడేళ్లుగా పనిచేస్తున్న, సొంత జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అధికారులు/ఉద్యోగులకు ఇక స్థానచలనం తప్పదు. వచ్చే ఎన్నికల ప్రక్రియలో వీరందరికీ భాగస్వామ్యం కల్పించకూడదని ఈసీ శుక్రవారం తీసుకున్న విధాన నిర్ణయం మేరకు ఉమ్మడి వరంగల్‌లో పలువురికి బదిలీ అనివార్యంగా మారనుంది. తహసీల్దార్ మొదలు కలెక్టర్ వరకు.. ఎస్‌ఐ మొదలు ఎస్పీల వరకు.. ఇలా వివిధ శాఖలకు చెందిన పలువురికి బదిలీలపై కసరత్తు మొదలైంది. 2024 జూన్ నాటికి మూడేళ్లు ఒకేచోట పనిచేసి ఉండకూడదన్న ఈసీ నిబంధనల మేరకు బదిలీల జాబితా సిద్ధం కానుంది. ఈ నేపథ్యంలో దీర్ఘకాలికంగా పూర్వ ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్ తదితర జిల్లాల్లో పనిచేస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులతో పాటు వివిధ శాఖలకు పలువురు ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

కీలక స్థానాలపైన ఆశావహుల దృష్టి..

2024 జనవరిలోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడానికి గడువుగా ఈసీ పేర్కొనడంతో క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందించే పోలీసు, రెవెన్యూ అధికారుల బదిలీలు జోరుగా జరగనున్నాయి. ఎన్నికల సమయంలో వీరే కీలకం కావడంతో ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా మాట వినేవారిని తమ నియోజకవర్గాల్లోకి బదిలీపై తీసుకువచ్చే ప్రక్రియ మొదలెట్టారు. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు ఎస్పీలు, ఇద్దరు అడిషనల్ డీసీపీలు, ముగ్గురు డీసీపీలు, ఎనిమిది ఏసీపీ/డీఎస్పీ స్థాయి అధికారులు బదిలీల జాబితాలో ఉన్నారు. అదే విధంగా సుమారు 31మంది ఇన్‌స్పెక్టర్లు జిల్లాలు మారడం అనివార్యం. రెవెన్యూలో ఇద్దరు కలెక్టర్లు, ముగ్గురు అడిషనల్ కలెక్టర్లు, ఏడుగురు ఆర్డీఓలు ఎన్నికల సంఘం నిబంధనల కిందకు రానున్నారు. వీరితోపాటు 29 మంది తహసీల్దార్లకు స్థానచలనం తప్పనిసరి. దీంతో వారి స్థానంలో పోస్టింగ్‌లు పట్టేందుకు ఆశావహులు చేస్తున్న ప్రయత్నాలతో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీసులు కిటకిటలాడుతున్నాయి. గ్రేటర్ వరంగల్ కమిషనరేట్‌తోపాటు హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పనిచేసేందుకు పలువురు పోలీసు, రెవెన్యూ అధికారులు క్యూ కడుతున్నారు. బదిలీలు పూర్తిగా రాజకీయ జోక్యంతోనే జరుగుతున్నాయనేది బహిరంగ రహస్యమే కావడంతో ప్రయత్నాలు చేసుకోవడం తప్పదని ఓ డివిజనల్ స్థాయి రెవెన్యూ అధికారి వాపోయారు.

మనోడైతే చూడండి..


ఓ వైపు పోస్టింగ్‌ల కోసం ఆశావహులు ప్రయత్నాలు జోరందుకోగా.. ప్రజాప్రతినిధులు సైతం 'మనోడైతే చూడండి.. వేసుకుందాం' అని షాడో నేతలకు హింట్ ఇస్తున్నారు. కీలక ఎన్నికల సమయంలో నమ్మకస్తులుగా తమ సామాజికవర్గం వారైతేనే ఉంటారని ఉమ్మడి జిల్లాలోని ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. చాలా చోట్ల



బదిలీలు, పోస్టింగ్‌ల్లో వారు తమ సామాజికవర్గం వారికే ప్రాధాన్యమిస్తున్నారు. కొన్నిచోట్ల తమ సామాజికవర్గం వారి చేతుల మీదుగానే వ్యవహారాలను చక్కబెడుతున్నారు. మరోవైపు కొంత మంది అధికారులు ఏళ్ల నుంచి ఇక్కడే వివిధ పోస్టింగ్‌ల్లో పనిచేస్తున్నారు. తీవ్ర ఆరోపణలున్నా... ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకొని పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తుండగా ఆ పోస్టింగ్‌ల్లో కొనసాగుతున్న వారికి 'మూడేళ్ల' గండం పొంచి ఉంది. ఈసీ నిబంధనలకు బదిలీ అనివార్యం కావడంతో వారి స్థానాల్లో తమ అనుయాయులను దింపే ప్రయత్నాలు కూడా కొందరు చేస్తున్నట్లు ప్రచారం ఉంది. వరంగల్, హనుమకొండ, జనగామ, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లో ఈ ప్రక్రియ మొదలైంది. ఇదిలాఉంటే కొందరు ఆశావహులు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలను ఆశ్రయిస్తుండగా.. మరికొందరు హైదరాబాద్ నుంచి ఉన్నతస్థాయి నుంచి రాజకీయ ఒత్తిళ్లు తీసుకువచ్చి తమకు అనుకూలమైన వారికి బదిలీలు అయ్యేలా చక్రం తిప్పుతున్నారు. మొత్తానికి ఎన్నికల సంఘం ప్రకటనతో ఉమ్మడి జిల్లాలో బదిలీల ప్రక్రియ ఉద్యోగ, అధికారవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

సురక్ష దినోత్సవం విజయవంతం చేయాలి

- ఎస్పీ సురేందర్‌రెడ్డి



భూపాలపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నేడు(ఆదివారం) జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సురక్ష దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 4వ తేదీన సురక్ష దినోత్సవం ర్యాలీ నిర్వహణ ఉంటుందని, తెలంగాణ సాంప్రదాయాన్ని సంస్కృతిని ప్రతిబింబించే విధంగా కళాకారులతో ప్రదర్శనలు ఉంటాయన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అవగాహన కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా హాజరుకావాలని ఎస్పీ సురేందర్‌రెడ్డి కోరారు.

పకడ్బందీగా హరితహారం

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో 9వ విడత హరితహారం (దశాబ్ది సంపద వనాలు) కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. 9వ విడత హరితహారంపై సంబంధిత అధికారులతో శనివారం ప్రగతి భవనం కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యతగా నీటిపారుదల శాఖ కింద కెనాళ్ల వద్ద పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఆదేశించారు.

రైతుల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ



భూపాలపల్లి రూరల్ : కొంపెల్లిలో ఎడ్లబండిపై గండ్ర



గణపురం: ఎడ్ల బండిపై వస్తున్న కలెక్టర్

కలెక్టర్ భవేష్ మిశ్రా

గణపురం: రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుందని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండలంలోని చెల్పూరు క్లస్టర్ పరిధిలోని రైతువేదికలో నిర్వహించిన రైతు దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. చెల్పూరు, కర్కపల్లి, మైలారం గ్రామాల నుంచి రైతులు ఎడ్లబండ్లతో ర్యాలీగా వచ్చారు. మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఊరేగింపుగా రైతువేదికకు చేరుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన ప్రగతిపై మండల వ్యవసాయ అధికారి సందేశాన్ని చదివి వినిపించారు. రైతులు ప్రభుత్వం నుంచి అందుకున్న సంక్షేమ పథకాలపై వారి అనుభవాలను తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రకృతి వైపరీత్యాల నుంచి సంరక్షణ కోసం పంట కాలం ఒక నెల ముందు వేసుకోవాలన్నారు. దీర్ఘకాలిక వరి సాగును జూన్ 5లోపు, మధ్యకాలిక వరి సాగును జూన్ 15లోపు, స్వల్పకాలిక వరి సాగును జూన్ 25 లోపు నార్లు వేసుకోవాలన్నారు. దీంతో అకాల వర్షాలతో వచ్చే నష్టాన్ని నివారించుకోవచ్చని తెలిపారు. అనంతరం రైతులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఓ పురుషోత్తం, మండల వ్యవసాయాధికారి అయిలయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి సోని, ఎంపీపీ కావటి రజిత, చెల్పూరు సర్పంచ్ నడిపిపెల్లి మధుసూదన్ రావు, చెల్పూరు, గణపురం పీఏసీఎస్ చైర్మన్లు గండ్ర సత్యనారాయణరెడ్డి, పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పొట్ల నగేష్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

భూపాలపల్లి రూరల్ : రైతుల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని, సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని నాగారం, దీక్షకుంట, నేరేడుపల్లి, పెద్దాపూర్, కొంపల్లి గ్రామాల్లో రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కొంపెల్లిలో ఎడ్లబండ్ల ర్యాలీలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. కొంపెల్లిలో హెల్త్ సబ్‌సెంటర్, రైతు వేదికను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోనే అన్ని రాష్ట్రాలలో కన్నా మన రాష్ట్రం అభివృద్ధిలో, సంక్షేమంలో ముందు వరుసలో ఉందన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు పెద్దపీత వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎంపీపీ మండల లావణ్య సాగర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కల్లెపు శోభ రఘుపతిరావు, సర్పంచ్ కాసగాని కవిత దేవేందర్, ఎంపీటీసీ పాతూరి సంధ్య దేవేందర్, జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్, ఎంపీడీఓ అనిల్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి పాల్గొన్నారు.

రాత్రినుంచే పోలీసుల ఆంక్షలు

ఇబ్బందిపడిన ప్రయాణికులు, వ్యాపారులు



అంబేద్కర్ సెంటర్‌లో రోడ్డుకు అడ్డుగా బారికేడ్లు

భూపాలపల్లి అర్బన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) నిర్వహించనున్న సురక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో శనివారం రాత్రి నుంచే పోలీసులు ఆంక్షలు విధించారు. దీంతో ప్రయాణికులు, చిరు వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నేడు భూపాలపల్లి పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సురక్ష దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 8.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుండగా శనివారం రాత్రి 7గంటల నుంచి పోలీసులు సమాచారం లేకుండా ఆంక్షలు విధించారు. కార్యక్రమం నిర్వహించనున్న అంబేడ్కర్ సెంటర్ నుంచి సుభాష్‌కాలనీ, జంగేడు వైపు వెళ్లే ప్రధాన రహదారికి రెండు వైపులా బారీకేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. బస్సులు, ప్రైవేట్ వాహనాల రాకపోకలను జయశంకర్ సెంటర్ నుంచి వర్క్‌షాప్ మీదుగా బస్టాండ్ రోడ్డుకు మళ్లించారు. దీంతో కాళేశ్వరం, గోదావరిఖని, సిరోంచ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు అంబేడ్కర్ సెంటర్‌లో రోడ్లపైనే బస్సుల కోసం వేచి చూశారు. రాజకీయ పార్టీల సభలు, సమావేశాల ఏర్పాటుకు సమయం, గడువు సూచిస్తూ, ప్రజలకు తగు ముందస్తు చర్యలు తీసుకునే పోలీసులు, అధికారులు.. తమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమం పట్ల ఈ విధంగా వ్యవహరించడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఈ విషయమై సీఐ రాంనర్సింహారెడ్డిని సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గాష్ ఆలం

ములుగు: నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు మావోయిస్టులను అరెస్ట్ చేసి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ములుగు జిల్లా ఎస్పీ గాష్ ఆలం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 01వ తేదీన విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వెంకటాపురం(కె) సర్కిల్ పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. నిషేధిత మావోయిస్టు పార్టీతో సంబంధం కలిగిన వ్యక్తులు పేలుడు పదార్థాలను అమర్చుతున్న క్రమంలో పట్టుకుని, పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశారు. పూజారి కాంకేర్ గ్రామం, ఊసూర్ బ్లాక్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మడివి దేవ మావోయిస్టు పార్టీ ఆర్‌పీసీ కమాండర్, మడకం ఊర సీఎస్ఎం కమాండర్‌గా పని చేస్తున్నారు. వెంకటాపురం(కె) మండల కార్యదర్శి సుధాకర్ ఆదేశాల మేరకు చెలిమెల అటవీ ప్రాంతంలో పేలుడు పదార్థాలను అమర్చాలని ఆదేశించారు. దీంతో పేలుడు పదార్థాలు అమర్చుతున్న క్రమంలో పోలీసులు చాకచక్యంగా ఇద్దరిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఓఎస్డీ అశోక్ కుమార్, సీఐ శివప్రసాద్, సీఆర్‌పీఎఫ్ ఎస్సై తిరుపతి రావు, పేరూర్ ఎస్సై హరీష్ , సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

ఐనవోలు: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పంథిని గ్రామం చింతకుంటలో చోటు చేసుకుంది. ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. దొంతి శ్రీనివాస్‌రెడ్డి(43) తనకున్న ఐదు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల శ్రీనివాస్‌రెడ్డి నూతనంగా ఇల్లు నిర్మించుకున్నాడు. దీంతో సుమారు రూ.10లక్షలు అప్పు అయింది. పంటలు పండక, భూమి అమ్ముకుని అప్పు తీర్చాలనుకున్నప్పటికీ సాధ్యం కాలేదు. అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురై గురువారం గడ్డిమందు తాగగా.. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య కవిత, కుమార్తెలు ఆశ్రిత, హారిక ఉన్నారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపారు.

వరంగల్‌లో నృత్యం చేస్తున్న యువతులు



హనుమకొండలో..



జనగామలో..



ఆవిర్భావ సంబురం

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత సాధించిన పురోగతిని వివరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



వరంగల్‌లో నిర్వహించిన ఆవిర్భావ వేడుకలో ప్రసంగిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత



మానుకోటలో అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



భూపాలపల్లిలో కురుమల విన్యాసాలు



భూపాలపల్లిలో అమరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



దుస్తులను పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



హనుమకొండలో అమరుల కుటుంబ సభ్యులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

రాష్ట్ర శాంతిభద్రతలను కాపాడుదాం

● పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ పూజ

మామునూరు: అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ అభివృద్ధిలో పోలీసుల విధి నిర్వహణ సైతం తోడ్పడాలని, సమష్టిగా రాష్ట్ర శాంతిభద్రతలను కాపాడుదామని పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అన్నారు. ఖిలా వరంగల్ మండలం పోలీస్ ట్రెనింగ్ కళాశాలలో రాష్ట్ర అవతరణ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. పోలీసు శిక్షణ కళాశాలలో పరిపాలన భవనం వద్ద పీటీసీ ప్రిన్సిపాల్ పూజ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత పోలీసు సిబ్బందిని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. బంగారు తెలంగాణ మన లక్ష్యమన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ముందుకెళ్తూ.. రాష్ట్ర శాంతిభద్రత, ప్రజల సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్, రమేష్, భిక్షపతి, పాండు నాయక్, ఏఎల్ఐలు రాధిక, సత్యనారాయణ, ఆర్ఐలు రాజేష్, చంద్రశేఖర్, దశరథం, నవీన్, సీఎల్ఐలు నరేష్, రవీందర్, డాక్టర్ సుధీర్, ఏఓ ఫర్హానా, పీఆర్ఓ రామచారి, 374 శిక్షణార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో ఆర్టీఓ ఆఫ్రీన్ సిద్దిఖీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఆర్టీఓ ఆఫ్రీన్ సిద్దిఖీ జాతీయ జెండాను ఆవిష్కరించగా.. ఎంవీఐలు రవీందర్, వెంకన్న, ఏఎంవీఐ శాలిని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ ఇంజారపు పూజ

అంతర్జాతీయ ఇన్‌స్పైర్‌కు ఎంపిక

కురవి: అంతర్జాతీయ ఇన్‌స్పైర్ పోటీలకు మానుకోట జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. కురవి మండలం బలపాల గ్రామానికి చెందిన నక్క భవాని, పెద్దవంగర మండలంలోని కొరిపల్లి హైస్కూల్ విద్యార్థి ఎడ్ల నాని 'సకురా సైన్స్ హై స్కూల్ ప్రోగ్రాం ఆఫ్ జపాన్' అనే కార్యక్రమానికి ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి 18 మంది విద్యార్థులు ఎంపికకాగా.. జిల్లానుంచి ఇద్దరికి అవకాశం వచ్చినట్లు ఎస్‌సీఈఆర్‌టీ నుంచి లేఖ వచ్చింది. నవంబర్‌లో జపాన్‌లో జరగబోయే అంతర్జాతీయ ఇన్‌స్పైర్‌కు ఎంపికకాగా, వీరు తమ అప్లికేషన్స్‌ను జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి పంపించాల్సి ఉంటుంది. భవానీ ఎంపికపై గైడ్ టీచర్ సారంగపాణి, బలపాల సర్పంచ్ ముండ్ల ప్రమీల, మండల రైతుబంధు సమితి కో–ఆర్డినేటర్ ముండ్ల రమేష్, గ్రామస్తులు శుక్రవారం అభినందించారు.



గైడ్ టీచర్ సారంగపాణితో భవాని

బండరాయి తలపై పడి యువకుడి దుర్మరణం

● పూడిక తీస్తుండగా ఘటన



పృథ్వి (ఫైల్)

రాయపర్తి: వ్యవసాయ బావిలో క్రేన్ సాయంతో పూడిక మట్టి తీస్తుండగా పైనుంచి బండరాయి తలపై పడి యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొండూరు శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సర్నేనిగూడెం గ్రామానికి చెందిన రూపాని నరహరి, యశోద దంపతులు, వారి కుమారుడు రూపాని పృథ్వీరాజ్ (26) ముప్పై ఏళ్లక్రితం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామానికి వచ్చి వ్యవసాయక్షేత్రాల్లోని బావుల్లో క్రేన్ సాయంతో పూడిక తీతమట్టి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్‌కు చెందిన నాగేశ్వర్‌రావు వ్యవసాయ భూమిలో బావిలో పూడిక మట్టి తీస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో ఉన్న పృథ్వీపై బండరాయి పడింది. ఈ ఘటనలో పృథ్వి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల కోసం స్థానిక ఎస్సై బండారి రాజును వివరణకోరగా ఎలాంటి పిటీషన్ రాలేదని తెలిపారు.

ఆటోలో నుంచి జారిపడి మహిళ మృతి



మృతిచెందిన విజయ

కేసముద్రం: అజాగ్రత్తతో ఆటో నడపడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ జారి కిందపడి మృతిచెందిన సంఘటన మానుకోట జిల్లా కేసముద్రం మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కల్వల గ్రామానికి చెందిన గంట విజయ(45) మానుకోటకు వెళ్లేందుకు ఓ ఆటోలో ఎక్కింది. ఈ క్రమంలో తాళ్లపూసపల్లి దాటాక ఆటో డ్రైవర్ యుగేందర్ అజాగ్రత్తగా ఆటో నడపడంతో ఆటోలో ప్రయాణిస్తున్న విజయ ఒక్కసారిగా జారి కింద పడింది. దీంతో తలకు తీవ్రగాయం కావడంతో ఆమెను మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందింది. ఈ మేరకు ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

ధర్మసాగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన హనుమకొండ మండలం ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధి కాజీపేట మండలం రాంపూర్ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఓ వ్యక్తిని ఢీ కొని తలపై నుంచి వెళ్లగా తల ఛిద్రమై మృతి చెందాడు. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్తున్న గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి పోలీసులు చేరుకున్నారు. అయితే మృతుని తల ఛిద్రమై గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. మృతుడి ఒంటిపై తెలుపురంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. రాంపూర్ వీఆర్‌ఏ రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

జేసీబీ ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు శ్రీధర్

కాజీపేట అర్బన్: ద్విచక్రవాహనాన్ని జేసీబీ ఢీ కొట్టడంతో దర్గా కాజీపేటకు చెందిన పబ్బోజు శ్రీధర్(33) మృతి చెందిన ఘటన శుక్రవారం న్యూశాయంపేట జంక్షన్‌లో చోటు చేసుకుంది. సుబేదారి పోలీసులు, మృతుడి సోదరుడు పబ్బోజు శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. దర్గాకాజీపేటకు చెందిన పబ్బోజు శ్రీధర్ నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం శ్రీధర్ దర్గా కాజీపేట నుంచి వరంగల్‌కు హంటర్‌రోడ్డు మీదుగా తన ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. న్యూ శాయంపేట జంక్షన్‌కు చేరుకోగా ఎదురుగా వస్తు న్న జేసీబీ డ్రైవర్ పల్లెపు సందీప్ అతివేగంతో వచ్చి ఢీ కొట్టాడు. దీంతో శ్రీధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేర కు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి ఆత్మహత్య

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధి సమ్మయ్యనగర్‌లో శుక్రవారం ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన కోటేశ్వరమ్మకు సమ్మయ్యనగర్‌లో కుమారులతో ఉంటూ కూలీ పనిచేసుకుంటుంది. అయితే చిన్న కుమారుడు తిరుపతి(16)కు సమాచారం ఇవ్వకుండా పెద్ద కుమారుడితోకలిసి కోటేశ్వరమ్మ గురువారం గుంటూరుకు వెళ్లింది. తనకు చెప్పకుండా వెళ్లినందుకు ఆందోళనకు గురైన తిరుపతి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

దశాబ్ది ఉత్సవాల నోడల్ ఆఫీసర్‌గా హరిత



కలెక్టర్ సిక్తాతో హరిత

హన్మకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాల నోడల్ ఆఫీసర్‌గా విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ హరితను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె శుక్రవారం హైదరాబాద్ నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. హరితను కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, శ్రీవత్స కోట, అశ్విని తానాజీ వాకడేలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయా జిల్లాల్లో సమన్వయంతో పనిచేసి దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లపై అన్నదాతల ఆగ్రహం

● కాటారం–మంథని ప్రధాన రహదారిపై బైఠాయింపు



రహదారిపై ధాన్యానికి నిప్పంటించి ఆందోళన చేస్తున్న రైతులు

కాటారం: ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగడం లేదని, కేంద్రం నిర్వాహకులు అడ్డదారి తొక్కుతూ పైసలు ముట్టజెప్పినవాళ్లకే గన్నీ సంచులు ఇస్తున్నారని ఆరోపిస్తూ రేగులగూడెం అన్నదాతలు ఆగ్రహించారు. శుక్రవారం కాటారం– మంథని ప్రధాన రహదారిపై రేగులగూడెం వద్ద రోడ్డుకు అడ్డంగా ధాన్యం బస్తాలు, కర్రలు వేసి రైతులు బైఠాయించారు. ధాన్యం బస్తాలకు నిప్పంటించి నిరసన తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు, రవాణాపై స్పష్టత వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగడంతో రోజుల తరబడి కేంద్రాల వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విక్రయించిన ధాన్యాన్ని తరలించడానికి లారీల కొరత ఉందని వర్షాలు పడితే తీవ్రంగా నష్టపోతామని పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చిన వారికే కేంద్రం నిర్వాహకులు గన్నీ సంచులు ఇస్తున్నారని కాంటాలు తొందరగా అయ్యేలా చూస్తున్నారని రైతులు ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణలో అధికారులు, సిబ్బంది విఫలమయ్యారని విమర్శించారు. కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ధర్నా సమాచారం అందుకున్న కాటారం ఎస్సై శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ జీవాకర్ రెడ్డి, పీఏసీఎస్ అధికారులతో ఎస్సై ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యను వివరించారు. రైతులకు ఇబ్బందులు కల్గకుండా త్వరగా కొనుగోళ్లు సాగేలా చూస్తామని తహసీల్దార్, సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

● జమ్మూకశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్‌సింగ్

మహబూబాబాద్ అర్బన్: డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమని జమ్మూకశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 60ఏళ్లలో చేయలేని అభివృద్ధి, పీఎం మోదీ తొమ్మిదేళ్ల పాలనలో సాధ్యమైందన్నారు. 370 ఆర్టికల్‌ను రద్దు చేసిన ఘనత బీజేపీదేనని, ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకొని దేశంలో కలిపామన్నారు. కేసీఆర్ తెలంగాణకు చేసిందేమీ లేదని విమర్శించారు. మానుకోట జిల్లాలో మెడికల్ కళాశాల కోసం గిరిజనుల భూములు లాక్కున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. దళిత, గిరిజనులకు 3 ఎకరాల భూమి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. తెలంగాణ కోసం బలిదానం చేసుకున్న కుటుంబాలను చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో దోచుకున్న వారికే సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని, 1,200 తెలంగాణ అమరవీరుల కుటుంబాల్లో ఒక్కరికి కూడా ఉద్యోగావకాశాలు కల్పించలేదని ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భారత్, ఫసల్ బీమా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన లాంటి పథకాలు తెలంగాణలో అమలు కావడం లేదన్నారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో లక్షల కోట్ల అవినీతి జరిగిందని, బిడ్డ కవిత లిక్కర్‌స్కాంలో ఉండగా, కొడుకు కేటీఆర్ ఐటీ మంత్రిగా ఉంటూ దోచుకుంటున్నారని ఆరోపించారు. పోడుభూముల పట్టాలు అందించడంలో సీఎం విఫలయ్యారని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్‌నాయక్, సీనియర్ నాయకులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.